# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక


## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.


సంచిక : 19 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | శనివారం | 19-4 -2025 | వెల : .రూ. 5.00



## సోనియా,రాహుల్ చట్టాలకు అతీతులా?

నేషనల్ హెరాల్డ్ కేసుపై బండి సంజయ్

**హైదరాబాద్ ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భారతదేశ రాజ్యాంగానికి సోనియా, రాహుల్ అతీతులా? చట్టాలు వీరికి ఎందుకు వర్తించకూడదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. డూప్లికేట్ గాంధీ కుటుంబం అంటూ మరోమారు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లను

-మిగతా 2 లో



## తెలంగాణలో తోషిబా భారీ పెట్టుబడులు

రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటు

- జపాన్ పర్యటనలో భారీ పెట్టుబడుల సాధన
- రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం
- సీఎం రేవంత్ సమక్షంలో కుదిరిన ఒప్పందం

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జపాన్ పర్యటనలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బృందం హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులను సాధించింది. రూ. 10,500 కోట్లతో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌టీటీ– డేటా,

-మిగతా 2 లో






## ఛత్తీస్‌ఘడ్‌లో 33 మంది నక్సల్స్ లొంగుబాటు

- అందరూ లొంగిపోవాలని అమిత్ షా పిలుపు

**రాయ్‌పూర్ ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వచ్చే ఏడాది మార్చి 31 నాటికి నక్సలైట్లను తుదముట్టిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా గురువారం మరోమారు ప్రకటించిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో 33 మంది నక్సలైట్లు శు క్రవారంనాడు లొంగిపోయారు. వీరిలో 17 మంది నక్సల్స్‌పై రూ.49 లక్షల రివార్డు ఉంది. తాజాగా లొంగిపోయిన వారిలో తొమ్మిది మంది మహిళలతో సహా 22 మంది సీనియర్ పోలీసులు అధికారులు, సీఆర్‌పీఎఫ్ ముందు లొంగిపోయారు. ఆ తర్వాత మరో 11 మంది పోలీసు అధికారుల ముందు లొంగిపోయారు. వీరిలో ఇద్దరు మహిళా నక్సల్స్ ఉన్నారు. మావోయిస్టు సిద్ధాంతాల భావజాలం,

-మిగతా 2 లో




## రాష్ట్రానికి ఏం చేశారో కిషన్ రెడ్డి చెప్పాలి

- ఊకదంపుడు ఉపన్యాసాలు మానాలి
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణలో బీజేపీ,బీఆర్ఎస్ నాటకాలాడుతన్నాయని టీపీసీసీ చీఫ్ మహేహ్ కుమార్ గౌడ్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ తో కలిసి కిషన్ రెడ్డి లాలూచీ నాటకాలాడుతున్నారని మండిపడ్డారు.

-మిగతా 2 లో





## బీఆర్ఎస్ రజతోత్సవ సభలో మహిళలకు పెద్దపీట

- ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్న పార్టీ అధినేత కేసీఆర్

**గజ్వేల్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పార్టీ అధినేత కేసీఆర్ సూచించారు. మహిళల భాగస్వామ్యం ఎక్కువగా ఉండాలన్నారు. సభపై ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ మహిళా నేతలతో పాటు పలువురు నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. సభలో మహిళల

-మిగతా 2 లో





## భగవద్గీత,నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు

- యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు
- కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోస్ట్
- భారీతీయులు గర్వించే విషయమన్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** భారతీయ సంస్కృతి, వారసత్వానికి చరిత్రాత్మక గుర్తింపు లభించింది. శ్రీకృష్ణుడి బోధించిన భగవద్గీతతో పాటు భరతముని రచించిన నాట్యశాస్త్రానికి యునెస్కో మెమరీ ఆఫ్ వరల్డ్ రిజిస్టర్‌లో చోటు లభించింది.

-మిగతా 2 లో



## అమరావతిలో మే 2న ప్రధాని మోడీ పర్యటన

మంత్రులతో ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పటు

**అమరావతి** ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించబోతున్న వేళ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పర్యటన ఏర్పాట్లకు సంబంధించి మంత్రులతో కమిటీలను ఏర్పాటుచేసిది. రాజధాని అమరావతి ప్రాంతంలో ప్రధాని పర్యటన కొనసాగనుంది.. భారత ప్రధాన మంత్రి రాజధాని పునఃనిర్మాణ పనులను

-మిగతా 2 లో

## భూభారతితో సమస్యలకు చెక్

ధరణితో ఇష్టారీతిన భూ బదలాయింపులు

- పైసా ఖర్చు లేకుండా భూభారతిలో ఫిర్యాదులు
- తహసిల్దార్ పరిధిలో సమస్యలు పరిష్కారం
- ఉమ్మడి జిల్లాకు ఒక సీసీఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు
- వెంకటాపూర్‌లో భూభారతి అవగాహన సదస్సులో పొంగులేటి

**ములుగు, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం సామాన్య రైతులకు న్యాయం జరిగేవిధంగా ఉంటుందని, రైతుల కళ్లలో ఆనందం చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్మని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భూ భారతి కార్యక్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ములుగు

-మిగతా 2 లో



## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం



- కొన్నిచోట్ల వడగళ్ల వర్షంతో ఈదురుగాలులు
- పలుచోట్ల కూలిన చెట్లు..ట్రాఫిక్‌కు అంతరాయం
- నగరంపై క్యుములోనింబస్ మేఘాలు ఆవరణ

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** హైదరాబాద్ నగర పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఎస్ఆర్‌నగర్, బోరబండ, అమీర్‌పేట, పంజాగుట్ట, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కోఠి, సుల్తాన్‌బజార్,

-మిగతా 2 లో

## మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్



- మూడు పార్టీలది తెలంగాణను ముంచే ఎజెండా
- ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రజలను దోపిడీ చేసి.. ఆడబిడ్డలపై అఘాయిత్యాలకు పాల్పడి.. ప్రజల రక్తం తాగిన మజ్లిస్ పార్టీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు జీ హుజూరంటున్నాయని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలపై కిషన్ రెడ్డి విర్శలు

-మిగతా 2 లో

# తెలంగాణలో తోషిబా భారీ పెట్టుబడులు

(మొదటి తరువాయి)

నెయిసా సంస్థలు సంయుక్తంగా ఈ డేటా సెంటర్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నాయి. టోక్యోలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో త్రైపాక్షిక ఒప్పందాలపై ప్రభుత్వ అధికారులు, సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు. మరోవైపు రుద్రారంలో రూ.562 కోట్లతో మరో పరిశ్రమ ఏర్పాటుకు తోషిబా ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే తోషిబా అనుబంధ సంస్థ టీటీడీఐ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. విద్యుత్ సరఫరా, పంపిణీ రంగంలో పెట్టుబడులు, ఆవిష్కరణలకు ఈ ఒప్పందం జరిగింది. రుద్రారంలో ఇప్పటికే ఈ సంస్థ రెండు ఫ్యాక్టరీలను నిర్వహిస్తోంది. ఈ భారీ పెట్టుబడులపై సీఎం రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పెట్టు-బడులు వస్తున్నాయి. తెలంగాణలో సింగిల్ విండో అనుమతులను ప్రభుత్వం ఇస్తోంది. నిపుణులు ఉన్నందున ఏఐ డిజిటల్ సేవల్లో తెలంగాణ అగ్రగామిగా నిలుస్తోంది. ఎన్‌టీటీ భారీ పెట్టుబడులతో డేటా సెంటర్ హబ్‌గా హైదరాబాద్ స్థానం సుస్థిరంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్, ఐటీ సర్వీసుల్లో ప్రపంచంలో పేరొందిన ఎన్‌టీటీ– డేటా, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫస్ట్ క్లౌడ్ ప్లాట్‌ఫాం సంస్థ నెయిసా నెట్ వర్క్స్ సంయుక్తంగా హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. టోక్యోలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ పెట్టుబడుల ఒప్పందం కుదిరింది. దేశంలో అతిపెద్ద ఏఐ కంప్యూట్ మౌలిక సదుపాయం హైదరాబాద్‌లో నిర్మించబోయే ఈ సదుపాయం 400 మెగావాట్ల డేటా సెంటర్ క్లస్టర్. 25,000 జీపీయూలతో దేశంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలను సమకూరుస్తుంది. దేశంలో తెలంగాణను అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రాజధానిగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. 500 మెగావాట్ల వరకు గ్రిడ్, పునరుత్పాదక విద్యుత్తు మిశ్రమంతో ఈ క్లస్టర్ నిర్వమిస్తారు. లిక్విడ్ ఇమ్మర్షన్ వంటి అత్యాధునిక కూలింగ్ టెక్నాలజీలను అవలంబిస్తారు. ఈ ప్రాజెక్టును అత్యున్నత ఈఎస్‌జీ (ఎన్విరాన్‌మెంటల్, సోషల్, గవర్నెన్స్) ప్రమాణాలతో అభివృద్ధి చేస్తారు. ఈ క్యాంపస్ తెలంగాణలోని విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఏఐ ప్రతిభను పెంపొందిస్తుంది. రాష్ట్ర డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్‌కు దోహదం చేస్తుంది. ఈ భారీ పెట్టుబడుల ఒప్పందంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానాలు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని అన్నారు. నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా, సింగిలో విండో అనుమతులను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ప్రతిభావంతులైన నిపుణులు అందుబాటులో ఉండటంతో ఏఐ సంబంధిత డిజిటల్ సేవల్లో రాష్ట్రం అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఎడబ్ల్యూఎస్, ఎస్‌టీటీ–, టిల్‌మన్ హోల్డింగ్స్, సీటీఆర్‌ఎల్‌ఎస్ వంటి పెద్ద కంపెనీల డేటా సెంటర్ ప్రాజెక్టుల వరుసలో ఎన్‌టీటీ భారీ పెట్టుబడుల ఒప్పందంతో దేశంలో ప్రముఖ డేటా సెంటర్ హబ్ గా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని అన్నారు. టోక్యోలో ప్రధాన కార్యాలయం కలిగిన ఎన్‌టీటీ– డేటా, ఐటీ సేవలు, డేటా సెంటర్లు, డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ లో పేరొందిన కంపెనీ. 50 కంటే ఎక్కువ దేశాల్లో 193,000 మంది ఉద్యోగులతో, ప్రపంచంలోని టాప్ 3 డేటా సెంటర్ ప్రొవైడర్లలో ఈ కంపెనీ ఒకటి. పబ్లిక్ సర్వీసెస్, బీఎఫ్ఎస్ఐ, హెల్త్‌కేర్, మాన్యుఫాక్చరింగ్, టెలికాం వంటి రంగాలకు ఈ సంస్థ సేవలు అందిస్తుంది.

# భూభారతితో సమస్యలకు చెక్

(మొదటి తరువాయి)

జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన భూ భారతి రెవన్యూ సదస్సుకు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ, సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రామకృష్ణారావు, రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ బుద్ద ప్రకాష్ తదితరులు హాజరయ్యారు. భూ భారతి రెవెన్యూ సదస్సును ప్రారంభించిన అనంతరం మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దేశానికి వెన్నముక రైతు అని, రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రైధరణి పోర్టల్ తీసుకువచ్చి గులాబీ నాయకులు ఇష్టా రీతిని వారి పేర్లపై వందల ఎకరాలు పట్టాలు చేయించుకుని, చట్టాన్ని చుట్టంగా మలుచుకుని రైతు బంధు పొందారు తప్పా సామన్య పేదరైతుకు న్యాయం జరిగిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఏర్పడగానే ధరణి పోర్టల్ ను బంగాళాఖాతంలో కలిపి సామాన్య రైతుకు శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా భూ భారతి చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చిన మేరకు భూ భారతి చట్టం తీసుకువచ్చామని అన్నారు. పైలట్ ప్రాజెక్టుగా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండలాన్ని ఎంచుకున్నట్లు– తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో సాదా బైనామాద్వారా రైతులు పెట్టుకున్న దరఖాస్తులు రాష్ట్ర వ్యాప్తంగా 9 లక్షల 24 వేలు ఆన్‌లైన్ లో ఉన్నాయని, అన్నింటికీ భూ భారతిలో అవకాశం కల్పించి రైతులకు న్యాయం జరిగేవిధంగా కృషి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వం ఇందిరమ్మ ప్రభుత్వం అని, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రైతులకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా భూ భారతి చట్టం రూపొందించి, చట్టం చేసిన 90 రోజుల్లోనే విధి, విధానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భూ భారతి పోర్టల్‌లో రైతు సమస్యలపై దరఖాస్తు చేస్తే ముందుగా తహశీల్దార్ పరిధిలో ఉంటుందని, తహశీల్దార్ చేయకపోతే ఆర్డిఓ, అదనపు కలెక్టర్ సరిచేయాలని, కలెక్టర్ చొరవ తీసుకుని పరిష్కారం చూపాలని అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఒక సిసిఎల్ఏ, ట్రిబ్యునల్ ఏర్పాటు చేయనున్నట్లు– అందులో సమస్యలకు పరిష్కారం అయ్యే విధంగా ఉంటుందని అన్నారు. రైతుల సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్‌లోని రెవెన్యూ కార్యాలయంలో టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అధికారులు నిబద్ధతలో పనిచేయాలని, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు– చేసి స్వయంగా కలెక్టర్లు వెళ్లి రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. గత బిఆర్ఎస్ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు చెప్పిన మాట వినలేదని విఆర్వో, విఆర్ఏ వ్యవస్థను రద్దు చేసి, 23 వేల మంది ఉద్యోగులను రోడ్డు పాలు చేసారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ భూములను కాపాడేందుకు ఒక అధికారి ఉండాలనే ఉద్దేశంతో తిరిగి గ్రామపాలనాధికారుల వ్యవస్థ తీసుకురావడం జరిగిందన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి రైతుల సమస్యలు పరిష్కంచేందుకు కృషి చేస్తారన్నారు. ధరణి చట్టం చేసిన తర్వాత రెవెన్యూ సదస్సులు ఎందుకు పెట్టలేదని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. సదస్సులు పెడితే ధరణి బాధితులు మీ వీపులు పగలకొట్టేవారని బీఆర్ఎస్ నేతలను ఉద్దేశించి పొంగులేటి వ్యాఖ్యానించారు. నోరు ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సాగు చేసుకుంటున్న రైతుల పేర్లకు బదులు, పింక్ షర్ట్ వేసుకున్న వాళ్లకు పట్టా పాసు పుస్తకాలు ఇచ్చింది గత కేసీఆర్ సర్కార్ అని ఆయన ఆరోపించారు.

## భగవద్గీత,నాట్యశాస్త్రానికి అంతర్జాతీయ గుర్తింపు

(మొదటి తరువాయి)

ఈ విషయాన్ని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారతీయ జ్ఞాన సంపద, కళాత్మక ప్రతిభను యావత్ ప్రపంచం గౌరవిస్తోంది. ఈ రచనలు మన దేశంపై ప్రపంచ దృక్పథానికి, మన జీవన విధానానికి పునాదులు. ఇప్పటివరకు మన దేశం నుంచి 14 శాసనాలు.. యునెస్కో రిజిస్టర్‌లో చోటు దక్కించు కున్నాయని కేంద్రమంత్రి తన పోస్ట్‌లో వెల్లడించారు. దీనిపై ప్రధాని మోదీ స్పందించారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయం. గీత, నాట్యశాస్త్రాన్ని యునెస్కో రిజిస్టర్‌లో చేర్చడం.. మన జ్ఞాన సంపద, సంస్కృతికి లభించిన ఘనమైన గుర్తింపు. ఇవి శతాబ్దాలుగా మన నాగరికత, ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించాయి. ప్రపంచానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని మోదీ సంతోషం వ్యక్తం చేశారు. యుద్ధరంగంలో సోదరులు, గురువులు, బంధు జనులందరినీ చూసి ధనుర్బాణాలు విడిచి చతికిల పడిపోయిన అర్జునుడికి శ్రీకృష్ణుడు చేసిన బోధ– భగవద్గీత. ఇందులో 18 అధ్యాయాలు ఉన్నాయి. మనుషులు ప్రవర్తించవలసిన తీరు, పారలౌకికాన్ని పొందే విధానం రెండింటినీ శ్రీకృష్ణుడు బోధించాడు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణంగా అభివర్ణించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి భారతీయుడూ గర్వించదగ్గ క్షణం. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## అమరావతిలో మే 2న ప్రధాని మోడీ పర్యటన

(మొదటి తరువాయి)

ప్రారంభించబోతున్నారు .. ఇప్పటికే ప్రధాని పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఫోకస్ పెట్టింది కూటమి ప్రభుత్వం.. అందులో భాగంగా.. ప్రధాని మోడీ ఏపీ పర్యటన ఏర్పాట్లకు సంబంధించి ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు దారీ చేసింది.. మంత్రులు పొంగూరు నారాయణ, నారా లోకేష్, పయ్యావుల కేశవ్, సత్యకుమర్ యాదవ్, నాదెండ్ల మనోహర్.. కొల్లు రవీంద్ర సభ్యులుగా ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటు అయ్యింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్ల పరిశీలన.. సభ జరిగే ప్రాంతంలో ఏర్పాట్లు– ... ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని కమిటీ నిర్ణయాలు తీసుకోనుంది. ఇప్పటికే ప్రధాని మోడీ పర్యటన కోసం నోడల్ ఆఫీసర్‌గా వీర పాండ్యన్‌ను నియమించింది. రాజధాని అమరావతి నిర్మాణాల పునఃప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఇప్పటికే ఖరారైంది. మే 2వ తేదీన సాయంత్రం 4 గంటలకు రాజధాని పనులను ప్రారంభించనున్నారు ప్రధాని.. పునఃప్రారంభోత్సవ కార్యక్రమం కోసం సచివాలయం వెనక బహిరంగ సభ వేదికను ఏపీ సర్కారు ఎంపిక చేసింది. ఇందుకోసం ఇప్పటికే ప్రభుత్వం ఏర్పాట్లు ప్రారంభించింది. ఈ క్రమంలో ప్రధాని పర్యటన ఏర్పాట్ల కోసం మంత్రుల కమిటీని ప్రభుత్వం నియమించింది. మరోవైపు భద్రతా ఏర్పాట్లను ఎస్పీజీ బృందం పర్యవేక్షిస్తోంది.

## హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం

(మొదటి తరువాయి)

బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, హిమాయత్‌నగర్, నారాయణగూడలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వాన పడింది. మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, కార్వాన్, బోయినపల్లి, తిరుమలగిరి, అల్వాల్, మారేడ్‌పల్లితో పాటు– కుత్బుల్లాపూర్ పరిసరాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుంది. గుండ్లపోచంపల్లి, దుండిగల్, దూలపల్లి, బహదూర్‌పల్లి, మియాపూర్, నానక్‌రామ్‌గూడలో వానపడుతున్నది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, చైతన్యపురి, దిల్‌షుఖ్‌నగర్, మియాపూర్, గచ్చిబౌలి, వనస్థలీపురం తదితర ప్రాంతాల్లో వానకురిసింది. గాంధీ భవన్ ప్రాంతంలో భారీ చెట్టు నేలకూలింది. చంపాపేట, సైదాబాద్, సరూర్‌నగర్‌తో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా నిలిచిపోయింది. మరో వైపు వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులుపడ్డారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లో రోడ్డుపై ఓ భారీ వృక్షం కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. అస్మాన్‌గఢ్ విద్యుత్ డివిజన్ పరిధిలో 67 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో జాప్యం చోటు– చేసుకుంది. బషీర్‌బాగ్‌లో పీజీ లా కాలేజ్ ఎదుట రోడ్డుపై ఓ చెట్టు కూలిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్యాంక్ బండ్ నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లే రోడ్డులో చెట్టు– కూలిపోయి.. వాహనాలు భారీగా నిలిచిపోయాయి. లంగర్ హౌస్ బాపునగర్ కాలనీలో చెట్టు కూలి.. రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వర్షానికి భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొన్ని చోట్ల గాలి వానకు చెట్లు విరిగిపడ్డాయి. దీంతో రోడ్డు మార్గాన వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ , ఖైరతాబాద్, లక్డీకపూల్, పంజాగుట్ట, సికింద్రాబాద్,కూకట్ పల్లి, బషీర్ బాగ్, అల్వాల్, బాల్ నగర్ , ఎరియాల్లో గాలి దుమారం, రాళ్ళ వాన పడింది. గచ్చిబౌలి, హైటెక్ సిటీ–, కొండాపూర్, భారీ వర్షానికి ఎక్కడిక్కడ నీళ్లు నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఒక్కసారిగా మారిన వాతావరణంతో పలు చోట్ల గాలి వాన కురిసింది. నగరంపై క్యుములో నింబస్ మేఘాలు ఆవరించాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండగా ఉన్న వాతావరణం.. ఒక్కసారిగా మారిపోయింది. చిమ్మ చీకట్లు అలుముకున్నాయి. దట్టమైన మేఘాలతో పగలే చీకట్లు అన్నట్లుగా వాతావరణం మారిపోయింది.

## సోనియా,రాహుల్ చట్టాలకు అతీతులా?

(మొదటి తరువాయి)

లక్ష్యంగా చేసుకొని ఆయన విమర్శల వర్షం కురిపించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను దోచుకునేందుకు యంగ్ ఇండియా సంస్థ పేరుతో 50 వేల కోట్ల రూపాయల ఆస్తులను స్వాధీనం చేసుకోవాలన్న కుట్రలో ఈ కుటుంబం మునిగిపోయిందని ఆరోపించారు. ఇదంతా యూపీఏ హయాంలోనే బయటపడిందని, నిందితులు అరెస్ట్ కాకుండా బెయిల్ తెచ్చుకున్నారని చెప్పారు. ఇందులో మోదీ, బీజేపీ పాత్ర ఎక్కడ ఉందని ఆయన ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల్లో మీకు వాటా ఉందని నమ్మితే, ధర్నా చేయాల్సింది –టె–న్ జనపథ్ (సోనియా ఇంటి ముందు) అని కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పు చేస్తే ఎవరు అయినా జైలుకెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. తెలంగాణలో వక్ఫ్ ఆస్తులపై జరుగుతున్న రాజకీయాల పట్ల బండి సంజయ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఒవైసీ కుటుంబం వక్ఫ్ ఆస్తులను ఆక్రమించుకొని లబ్ధి పొందుతుండగా, పేద ముస్లింలకు ఏ ప్రయోజనం లేదని విమర్శించారు. ఆలయాలు, గురుద్వారా, క్రైస్తవ మత్సకారుల భూములపై కూడా వక్ఫ్ పేరు చెప్పి దోచుకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా మజ్లిస్ చేస్తున్న ఆందోళనకు రేవంత్ ఆర్థికంగా సహకరిస్తున్నారంటూ సంచలన ఆరోపణ చేశారు.

## ఛత్తీస్‌ఘఢ్‌లో 33 మంది నక్సల్స్ లొంగుబాటు

(మొదటి తరువాయి)

స్థానిక గిరిజనలపై జరిగిన దురాగతాలపై విసిగిపోయి లొంగిపోతున్నట్లు– వీరంతా ప్రకటించారని సుక్మా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కిరణ్ చవాన్ తెలిపారు. మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు– రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రివార్డులను అందచేస్తామన్నారు. అజ్ఞాతంలో ఉన్న నక్సల్స్ సాధ్యమైనంత త్వరగా లొంగిపోవాలని, జనజీవన ప్రవంతిలో కలిసిపోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా శుక్రవారం నాడు మరోసారి పిలుపునిచ్చారు. 2026 మార్చి 31 కల్లా నక్సల్స్ బెడద నుంచి దేశానికి విముక్తి కలిగించాలనే కృతనిశ్చయంతో కేంద్రం ఉందని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలో 22 మంది మావోయిస్టులను కోబ్రా కమెండోలు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేశారని, వారి నుంచి అధునాతన ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం చేసుకున్నారని అమిత్‌షా తెలిపారు. 11 మంది మావోయిస్టులు కూడా సుక్మా జిల్లా బడేసేటీ– పంచాయతీలో లొంగిపోయారని, దీంతో నక్సల్స్ బెడద నుంచి ఆ పంచాయతీకి విముక్తి లభించిందని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## బిఆర్ఎస్ రజతోత్సవ సభలో మహిళలకు పెద్దపీట

(మొదటి తరువాయి)

కోసం ప్రత్యేక ఏర్పాట్లు–, సభ విజయవంతంలో వారి భాగస్వామ్యం, అనుసరించాల్సిన వ్యూహాలు, కార్యాచరణకు సంబంధించిన తగిన సూచనలు చేస్తూ కేసీఆర్ ఎర్రవెల్లి నివాసంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు, పార్టీ మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన వారిలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, వొడితెల సతీష్ కుమార్, పార్టీ మహిళా నేతలు మాజీ ఎమ్మెల్యే చంద్రావతి, టీఎస్‌పీఎస్సీ మాజీ మెంబర్ సుమిత్రా తనోబా, గిడ్డంగుల శాఖ మాజీ ఛైర్ పర్సన్ రజినీ సాయిచంద్, నవీన్ ఆచారి, పార్టీ నేతలు మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గాదరి బాలమల్లు, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రానికి ఏం చేశారో కిషన్ రెడ్డి చెప్పాలి

(మొదటి తరువాయి)

పొద్దున లేస్తే కులాలు ,మతాలు పంచాయతీ పెట్టేప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కిషన్ రెడ్డి కాదు కిస్మత్ రెడ్డి. కష్టం లేకుండా గెలుస్తున్నారని అన్నారు. మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. పొద్దున లేస్తే కిషన్ రెడ్డి ముస్లిమ్ జపం చేస్తడు. అక్బరుద్దీన్ ఒవైసీ మీదనే కిషన్ రెడ్డి రాజకీయం చేస్తడు. పోయిన జన్మలో ఒవైసీ, కిషన్ రెడ్డి బ్రదర్స్ అయి ఉంటారని అన్నారు. చెప్పుతో ఎవరిని కొడతారు కిషన్ రెడ్డి. నువ్ మగాడివి అయితే 10 ఏండ్లలో నీ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చకు రా అంటూ సవాల్ చేశారు. దిగజారుడు భాష రాజకీయాల్లో మంచిది కాదు. 8 మంది ఎంపీలు ఎమ్మెల్యేలు,ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండీ రాష్ట్రానికి ఏం తెచ్చారని నిలదీసారు.. కిషన్ రెడ్డికి మతం తప్ప అభివృద్ధిపై దృష్టి లేదు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్ రెడ్డి, సంజయ్ ..ఎంపీలతో ఏనాడైనా మాట్లాడారా. పనికిరాని వాళ్లు ఏఐ పోస్టులు పెడితే కిషన్ రెడ్డి వాటిని కాపీ కొడతాడు. బండి సంజయ్ ఎపుడు ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదు. సన్నబియ్యం కేంద్రానివి అంటడు. మరి బీజేపీపాలిత రాష్ట్రాల్లో ఎందుకివ్వట్లేదు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మజ్లిస్ పార్టీ ఉచ్చులో కాంగ్రెస్, బీఆర్ఎస్

(మొదటి తరువాయి)

గుప్పించారు. ఈ మూడు పార్టీలు కలిసి తెలంగాణను ముంచే ఎత్తుగడలు వేస్తున్నాయని ఆయన ఆరోపించారు. శుక్రవారం బేగంపేట హరిత ప్లాజాలో జరిగిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని.. పార్టీ నాయకులు, శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎందుకు పోటీ– చేయడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీకి వంగి వంగి సలాం కొడుతున్న రాహుల్ గాంధీ, కేసీఆర్‌లకు బీజేపీని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు. రజాకార్ల వారసత్వాన్ని పొందిన మజ్లిస్ పార్టీకి వ్యతిరేకంగా జాతీయ వాద భావనతో బీజేపీ పోటీ– చేస్తోందని వివరించారు. మజ్లిస్ పార్టీ,రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమకారుల వారసత్వాన్ని బీజేపీ కొనసాగిస్తోందని గుర్తు చేశారు. మజ్లిస్ పాత బస్తీకే మాత్రమే పరిమితం కాలేదని.. ఆ పార్టీ ప్రస్తుతం తెలంగాణలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చాప కింద నీరులా విస్తరిస్తోందంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ మూడు పార్టీలు ఒకే తానుముక్కలుగా కలిసి పని చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో మజ్లిస్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు.

## తెలుగు పంచాంగం 19/4/2025 శనివారం



సూర్యోదయం - సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 6:01
సూర్యాస్తమయం: సాయంత్రం 6:29
చంద్రోదయం: రాత్రి 12:08 (ఏప్రిల్ 20)
చంద్రాస్తమయం: ఉదయం 11:17 (ఏప్రిల్ 20)

తిథి
కృష్ణ షష్టి: ఏప్రిల్ 18 సా. 5:07 నుండి ఏప్రిల్ 19 సా. 6:22 వరకు
కృష్ణ సప్తమి: ఏప్రిల్ 19 సా. 6:22 నుండి ఏప్రిల్ 20 సా. 7:01 వరకు

నక్షత్రం
మూల: ఏప్రిల్ 18 ఉ. 8:21 నుండి ఏప్రిల్ 19 ఉ. 10:21 వరకు
పూర్వాషాఢ: ఏప్రిల్ 19 ఉ. 10:21 నుండి ఏప్రిల్ 20 ఉ. 11:48 వరకు
?

అశుభ సమయాలు (దోషకాలాలు)
రాహుకాలం: ఉ. 9:08 - 10:41
యమగండం: మ. 1:48 - 3:22
దుర్ముహూర్తం: ఉ. 7:40 - 8:30
వర్జ్యం: ఉ. 8:37- 10:21, సా. 8:32 - 10:14 ? ?

శుభ సమయాలు (శుభ ముహూర్తాలు)
అభిజిత్ ముహూర్తం: మ. 11:50 - 12:40
బ్రహ్మ ముహూర్తం: ఉ. 4:24 - 5:12

# వెల్దండలో బీజేపీ క్రియాశీల సభ్యత్వ సదస్సు



**వెల్దండ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో క్రియాశీల సభ్యత్వ సదస్సు ఏప్రిల్ 18న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కృష్ణ గౌడ్, కల్వకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శేఖర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కురుమిద్ద యాదగిరి పాల్గొన్నారు. సభలో బీజేపీ క్రియాశీల సభ్యత్వం, "ఒకే దేశం, ఒకే ఎన్నిక" అంశాలపై చర్చ జరిగింది. రానున్న స్థానిక సంస్థల సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలలో ప్రతి గ్రామం, ప్రతి వార్డులో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు కురుమిద్ద యాదగిరి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పి ప్రజా సమస్యలను గాలికొదిలేసి, ఇతర పార్టీలపై నిందలు వేయడం తగదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. బీజేపీ నాయకులు ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని, పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో వెల్దండ మండలంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# సీఐ గంగాధర్ కు ఘన సత్కారం



**కడ్తాల్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో, కడ్తాల్ మండలానికి బదిలీపై వచ్చిన సీఐ గంగాధర్‌కు ఘన సత్కారం జరిగింది. సభ సందర్భంగా ఆయనకు శాలువా అపరాధానంగా సమర్పించి, మహాత్మా జ్యోతిరావు పూలే మరియు సావిత్రీబాయి పూలే చిత్ర పటాలను బహుకరించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా తెలంగాణ యువజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్ పాల్గొన్నారు. ఆయనతోపాటు రావుల కుమార్, సిద్ధిగారి మహేష్, చెన్న మోని కృష్ణ, ముదిరాజ్ మైసిగండి, వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు సబావత్ సీతారాం, కావలి కుమార్, క్రాంతి కుమార్ తదితర యువజన నాయకులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నందిగామ మండలం ఎంపీడీవో కార్యాలయ భవనం స్లాబ్ నిర్మాణ పనుల ప్రారంభం

-ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**నందిగామ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నందిగామ మండల కేంద్రంలో లో నూతనంగా నిర్మిస్తున్న ఎంపీడీఓ కార్యాలయం భవనం స్లాబ్ నిర్మాణ పనుల ప్రారంభం జరిగింది. స్లాబ్ నిర్మాణ పనుల కార్యక్రమాలను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జంగ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ, చంద్ర పాల్ రెడ్డి, రాం రెడ్డి, శంకరయ్యచించేటి, కృష్ణ గౌడ్, బోమ్మ గళ్ళ నర్సింలు, ఎర్రగారి రమేష్, రామస్వామి గౌడ్, జంగయ్య గౌడ్, గంగిశెట్టి శ్రీశైలం, జంగారి రాములు, తడకల జంగయ్య, కాంట్రాక్టర్ బిక్షపతి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి




**ఆమనగల్లు, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపి చట్టం చేయడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు లో శుక్ర వారం ముస్లింలు భారీ నిరసన ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు.పట్టణంలోని జామ మసీదులో నమాజ్ ముగిసిన అనంతరం జామియా మజీద్ అధ్యక్షులు మహమ్మద్ మాసూమ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు భారీ బ్యానర్, ప్లకా ర్ధులు జాతీయ జండాలతోపాటు నల్ల జండాలు పట్టుకొని మసీదు నుంచి శ్రీశైలం, హైదరాబాద్ జాతీయ రహదారి మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ, వక్ఫ్ చాటని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వీ రుధమని ముస్లింల హక్కుల ను ముప్పుగ ఏర్పడే ఈ బిల్లుకు ప్రతీ పడిత సవరనల ఆలోచనలు మానుకోవాలినీ సూచించరూ మత స్వేచ్చను తిరస్కరెంచి రాజ్యంగా నిబంధనలను ఉలగెంచే వక్ఫ్ లక్ష్యలకు వీరుధమయిన అనెక వివక్షత గల నిబంధనలు. ఉనాయి అనా రు, భారత రాజ్యాంగం ముస్లీం లకు కలిపిచిన హక్కు లను మోదీ ప్రభుత్వం కళారస్తుందని పేర్కొనారుఅనంతరం మండల పరిషత్ కార్యాలయ లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగింది అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సిఐ జానకిరామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయా మజీద్ అధ్యక్షులు గౌస్ మైనుద్దీన్, జానీ భాయ్, సయ్యద్, సయ్యద్ మీర్, మైనార్టీ సోదరులు నయీమ్, జహంగీర్, జబ్బార్, మసూద్ , రజాక్, అల్తాఫ్, ఎజాస్, ఖాదర్, హైమత్, జాంగిర్ అలీ, జావిద్, అఫ్జల్, అహ్మద్, ముజీబుర్రహ్మాన్, జహంగీర్ బాబా, అక్రమ్,, కుదుర్స్ , జాంగిర్, సోహెబ్,అన్వర్, బాబా, అలీమ్, అజీమ్, అజ్జు, కలీం, ఫరీద్, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

# అల్వాల గ్రామానికి 30 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు

-ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపిన గౌని సుదర్శన్ రెడ్డి
-గుడిసె కాలిన బాధితురాలికి మొదటి ఇందిరమ్మ ఇల్లు ఎంపీడీవో సద్గుణ




**పెద్దమందడి,ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దమందడి మండల కేంద్రంలోనీ రైతు వేదిక భవనంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో ఎంపీడీవో సద్గుణ సమీక్ష సమావేశం నిర్వహించారు .ఈ క్రమంలో ఆమె మాట్లాడుతూ అల్వాల గ్రామానికి ఎమ్మెల్యే మెఘరెడ్డి కృషి తో 30 ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలైన లబ్ధిదారులకు మంజూరు చేశారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మొదటిగా నిరుపేద గుడిసే ఉన్న వాళ్ళ స్థలాలకు ఇవ్వాలని, అలాగే నెలరోజుల క్రితం అల్వాల గ్రామంలో నిరుపేద కుటుంబీకురాలైన నక్క అంజనమ్మ గుడిసె విద్యుత్ షాక్ తో దగమైంది, గ్రామంలో మొదట ఇందిరమ్మ ఇల్లు ఆవిడకు శాంక్షనైందని మొదటి ప్రాధాన్యత ఆ నీరు పేద కుటుంబం వారికి ఇస్తున్నామని ఆమేతెలిపారు. ఈ క్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకుడు మాజీ ఉపసర్పంచ్ గౌని సుదర్శన్ రెడ్డి అల్వాల గ్రామ అభివృద్ధికై తోడ్పడుతున్న ఎమ్మెల్యే మెగా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొందల .కురుమూర్తి ,ఎస్.ఆంజనేయులు కే.సంధ్య, ఎస్.అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు... ఇందిరా పార్కులో సినీ కార్మికుల ధర్నా...

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిత్రపురి 3 వేల కోట్ల పెద్ద స్కామ్ (భూమి విలువతో) విషయంలో నవోదయం పార్టి ఆధ్వర్యంలో ఛలో ఇందిరా పార్క్ శనివారం ఉ ఉదయం 10 గల నుండి సా: 5 గల వరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు సినీ కార్మికులు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్ట్ ఆర్డర్స్ ని పాటించకుండా కో - ఆపరేటివ్ అధికారులు, చిత్రపురి అవినీతి కమిటి తో కుమ్మక్కయి పేద సినీ కార్మికుల ను మోసం చేస్తున్నారని, అవినీతి కమిటి ని వెంటనే సస్పెండ్ చేసి అడ్ హాక్ కమిటి వేసి విజిలెన్స్ & ఎన్ఫోర్స్మెంట్ ఎంక్వయిరీ చేయాలనీ పేద సినిమా కార్మికులకు న్యాయం చేయాలనీ నవోదయం పార్టి డిమాండ్ చేసింది. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గుండాల గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలు



**వెల్దండ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల పరిధిలోని గుండాల గ్రామంలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంబి నజరేత్ చర్చిలో పాస్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. మానవుల పాప పరిహారార్థం యేసు క్రీస్తు సిలువ వేయబడి, సిలువపై ఆయన అనుభవించిన శ్రమలను గుర్తుచేస్తూ, ఆయన పలికిన ఏడు మాటలను ధ్వనించారు. ఈ కార్యక్రమంలో సంఘ పాస్టర్ జోసెఫ్ తో పాటు మున్న శాంసన్, పీటర్ ప్రసాద్, యాదగిరి, రవికుమార్, సంధ్యా, మీనా, బాలకృష్ణమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకలు క్రైస్తవ సమాజానికి ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించాయి.

# కేటీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించిన కాయితి విజయ్ కుమార్ రెడ్డి



**కల్వకుర్తి, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు కాయితి విజయ్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ నేత కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు చేశారు. నిన్నటి ప్రెస్ మీట్‌లో కేటీఆర్, కాంగ్రెస్ పార్టీని మరియు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని విమర్శించడం మాత్రమే పనిగా పెట్టుకున్నారని, కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఏమీ చేయడం లేదని ఆయన ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలను అహంకారపూరితమైనవిగా అభివర్ణిస్తూ, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బిఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించడమే ఇందుకు నిదర్శనమని విజయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో కనీసం అభ్యర్థులు దొరకకపోవడం బిఆర్ఎస్ పార్టీ శ్రేణుల దిక్కుతోచని స్థితిని సూచిస్తోందని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇది సిగ్గుచేటని విజయ్ కుమార్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజాధనాన్ని వృథా చేయడమే కాకుండా, రైతుబంధు పేరిట భూస్వాములకు ప్రయోజనం కల్పించడం వంటి చర్యలు అసమర్థ పాలనకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం, లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ, ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేస్తోందని విజయ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమాన్ని బలహీన వర్గాలకు అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, రైతులు తలెత్తుకొని తిరిగే పరిస్థితిని కల్పించడమే ఆయన ధ్యేయమని వివరించారు. కేటీఆర్ తన అజ్ఞానాన్ని వీడి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని విజయ్ కుమార్ రెడ్డి సూచించారు. ముఖ్యమంత్రి మీద విమర్శలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెబుతామని ఆయన హెచ్చరించారు.

# సారీ ఫంక్షన్ కు హాజరైన కాంగ్రెస్ నాయకులు.

**చెన్నారావుపేట ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి గ్రామా పంచాయతీ కార్యదర్శి దెబ్బట కృష్ణ మారాజు-ప్రణీత కూతురు అమరపాలి శారీ ఫంక్షన్ కు ఉప్పరపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టే తిరుపతి రెడ్డి హాజరై ఆస్వాదించారు, ఈ కార్యక్రమంలో మండల యువ నాయకుడు వట్టే శ్రీనివాస్ రెడ్డి, తరంగాల రిపోర్టర్ పోగుల అశోక్. తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి**



**ఆమనగల్లు, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమనగల్లు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీత నర్సింహా, తలకొండపల్లి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులను రాజులుగా మార్చడమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లు పండిస్తున్న రైతులకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ అందజేస్తూ ప్రోత్సహిస్తోందని వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా కృషి చేస్తోందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులను త్వరలో అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్, తాళ్ల రవీందర్, సంపత్ కుమార్, అంజయ్య గుప్తా, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, కండె పాండు రంగయ్య, రవీందర్, యాదయ్య, రమేష్, నరేష్ నాయక్, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ అనిత విజయ్, మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ధనుంజయ, మాజీ సర్పంచ్ గుర్రం కరుణ శ్రీ కేశవులు, అప్పం శ్రీను, అబ్దుల్ ఖాదర్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఖాదర్ ఖాద్రి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎంగలి ప్రసాద్, ఎన్‌ఎస్‌ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, సోషల్ మీడియా కన్వీనర్లు దేవరశెట్టి మహేష్, నాజర్, కొప్పు విజేందర్, పులికంటి మైసయ్య, షాబుద్దీన్, సురేష్ నాయక్, దుడ్డు కృష్ణ యాదవ్, అంజద్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:





మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.
నిజం బయటకి తీయటం కోసం, నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్ ప్రెస్ న్యూస్ సంప్రదించండి.
అన్ని వేళాల మీతో పాటు ఉంటుంది.
ఈమెయిల్: neelagiriexpress@gmail.com
సంప్రదింపు నెంబర్: 9705770909
మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

**మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!**

## హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి విస్తరణకు బీజేపీ నేతల డిమాండ్

**-కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మెమోరాండం అందజేత**



**హైదరాబాద్, ఏప్రిల్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్ నుంచి శ్రీశైలం వరకు ఉన్న జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాలని కోరుతూ బీజేపీ నేతలు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు.
శుక్రవారం నాంపల్లి బీజేపీ పార్టీ కార్యాలయంలో మాజీ జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, ఆమనగల్ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కండె హరిప్రసాద్‌లు కలిసి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ – "హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి రోజురోజుకూ రద్దీగా మారుతోంది. ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటం ఆడే ప్రమాదకర స్థితికి చేరుకుంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ఈ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించాల్సిన అవసరం అత్యవసరం. తిరుమల తర్వాత భక్తుల అధిక సంఖ్యలో తరలివచ్చే శ్రీశైలం దారిలో రహదారి విస్తరణ అనివార్యం" అని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రంలోని పలు అభివృద్ధి అంశాలపై, రానున్న మున్సిపల్ ఎన్నికల పరిణామాలపై కూడా వారు మంత్రితో చర్చించారు. రహదారి విస్తరణ పనులకు కేంద్రం నిధులు విడుదల చేయాలని, త్వరితగతిన ప్రక్రియ ప్రారంభించాలని స్పష్టంగా కోరారు.

## కేవీఎన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మల్లేపల్లి జగన్



**వంగూరు, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
వంగూరు మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీయన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ పాల్గొన్నారు. కేవీయన్ రెడ్డి మాట్లాడుతూ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ కర్గే నేతృత్వంలో "జై బాపు, జై భీమ్, జై సంవిధాన్" ప్రజాస్వామ్య పరిరక్షణ పాదయాత్రను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా, బీజేపీ పార్టీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించడం వంటి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా ప్రభుత్వం బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని వివరించారు. సన్న బియ్యం పథకం, భూభారతి చట్టం వంటి పథకాలను ప్రజలకు క్లుప్తంగా వివరించి, కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి, గడపగడపకు కార్యక్రమాలను వివరించాలని కేవీయన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# జనసేవలో అంకితభావానికి గౌరవం... డాక్టర్ వెంకన్న బాబుకు విశిష్ట పురస్కారం..

**-ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు గౌరవ డాక్టరేట్ అవార్డు..**
**-ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ అవార్డు అందజేత..**

**షాద్‌నగర్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన ప్రముఖ సామాజికవేత్త బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు గౌరవ డాక్టరేట్ పురస్కారం లభించింది. ఏషియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ తరఫున ఆయనకు ఈ గౌరవం కలిగింది. భాగ్యనగరంలోని నాంపల్లి పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోనీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఏషియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ,స్ఫూర్తి అకాడమీ చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ చేతుల మీదుగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబుకు గౌరవ డాక్టరేట్ అవార్డు అందుకున్నారు. లైన్స్




క్లబ్, నేషనల్ హ్యూమన్ రైట్స్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కన్స్యూమర్ ఫోరం ద్వారా సామాజిక సేవ, వైద్య సేవలు, జర్నలిజం, యువత అభివృద్ధి వంటి విభాగాల్లో డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందించామని నిర్వాహకులు తెలిపారు. కరోనా సంక్షోభ సమయంలోను పలు సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న వెంకన్న బాబు సేవలు ప్రశంసనీయం అని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆకుల రమేష్ మాట్లాడుతూ డాక్టర్ వెంకన్న బాబు సేవా దృక్పథం, ప్రజల పట్ల నిబద్ధత, విలువలతో కూడిన జీవనశైలి ఆయనను ఈ గౌరవానికి అర్హుడిగా చేశాయని పేర్కొన్నారు. డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు స్పందిస్తూ ఇన్నేళ్లుగా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా చేస్తున్న సేవలకు గౌరవ డాక్టరేట్ రూపంలో గుర్తింపు రావడం సంతోషంగా ఉంది అని ప్రతి ఒక్కరూ తమ తమ స్థాయిలో సామాజిక బాధ్యతను పంచుకుంటూ పని చేస్తే సమాజ అభివృద్ధికి తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన యూనివర్సిటీకి, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు..

# కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలి...

**-వేసవి సెలవుల్లో టీచర్ల ప్రమోషన్స్, బదిలీల షెడ్యూల్ విడుదల చేయాలి**
**-పెండిరగ్ బిల్లులు, డి.ఎ.లను వెంటనే విడుదల చేయాలి**
**-సి.పి.ఎస్. విధానాన్ని రద్దు చేయాలి**




**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర కార్యాలయం గన్‌ఫౌండ్రి, హైదరాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి సంఘ కర్యకలాపాల నివేదికను కమిటీలో ప్రవేశపెట్టినారు. ఈ సమావేశంలో ఈనెల 13వ తేదీన కామారెడ్డిలో ఆనారోగ్య కారణాలతో మరణించిన టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కందుకూరి రమణ మరియు వరంగల్‌లో మరణించిన ఏపిటిఎఫ్ సీనియర్ నాయకులు పెద్దోజు నాగభూషణం లకు రాష్ట్ర కమిటీ పక్షాన నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ యాజమాన్యాల ఆధ్వర్యాన పలు రకాల పాఠశాలలను నెలకొల్పి అంతరాలు కల్గిన విద్యా విధానాన్ని అమలు చేయడం ద్వారానే విద్యారంగంలో అసమానతలు ఏర్పడ్డాయి. వివిధ యాజమాన్యాల కింద కొనసాగుతున్న పాఠశాలలను రద్దు చేసి, ప్రైవేటు పాఠశాలల వ్యవస్థను రద్దు చేసి విద్యార్థులందరికీ సమానమైన, నాణ్యమైన, శాస్త్రీయమైన విద్య అందించాలంటే "కామన్ స్కూల్ విద్యా విధానాన్ని" వెంటనే అమలు చేయాలని




ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 56 పాఠశాలలకే వేలకోట్ల నిధులు కేటాయించి వేలాది పాఠశాలల అభివృద్ధికి అరకొర నిధులు కేటాయించడం సరైనది కాదని, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో అన్ని యాజమాన్యాల కింద కొనసాగుతున్న ఉపాధ్యాయుల ప్రమోషన్ల, బదిలీల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెండిరగ్‌లో ఉన్న డి.ఎ.లను, పెండిరగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సి కమిటీ రిపోర్టును బహిరంగపరిచి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, విద్యారంగంలో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల హక్కులను పరిరక్షించాలని, ఆపరేషన్ కగార్ పేరిట జరుగుతున్న హింసను వెంటనే ఆపివేయాలి. ఇరువర్గాలు శాంతి చర్చలు జరిపి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం.ప్రకాశ్ రావు, పూర్వ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.మహేందర్ రెడ్డి, ఎం.లక్ష్మయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శులు ఆత్రం భుజంగరావు, ఎస్.విజయ్, బి.రమేష్, డి.రాజయ్య, వై.పద్మ లు పాల్గొన్నారు.

# చెట్టు = అమ్మ
# చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.


"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# నీలగిరి ఎక్స్ ప్రెస్ కథనానికి స్పందన

- మోటకొండూరు తహసిల్దార్ పై చర్యలకు ఆదేశం
- ఇలాంటి పనులు ఎక్కడైనా జరిగితే ఉద్యోగం ఉస్ట్
- యాదాద్రి కలెక్టర్ హనుమంత్ రావు





యాదాద్రి భువనగిరి,ఏప్రిల్ 18 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )
యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల తహసిల్దార్ కార్యాలయం లో అవినీతి జరుగుతోంది అంటూ నీలగిరి ఎక్స్ ప్రెస్ ఓ కథనం ప్రచురించింది దానిపై స్పందించిన కలెక్టర్ హనుమంత్ రావు తహసిల్దార్ పై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితి జిల్లాలో ఎక్కడ జరిగిన ఉద్యోగం నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.



యాదాద్రి భువనగిరి జిల్లా
కలక్టర్ హనుమంత్ రావు

# నెరవేరిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కల

- నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయిన మొదటి విడత డబ్బులు
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపిన అప్పారెడ్డిగూడ వాసులు
- హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నందిగామ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఇందిరమ్మ నిర్మాణ లబ్ధిదారుల కల నెరవేరింది.షాద్ నగర్ నియోజకవర్గం నందిగామ మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ గ్రామంలో ప్రారంభమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు గురువారం వారి ఖాతాలో మొదటివిడతగా లక్ష రూపాయలు జమ అయ్యాయి. ఈ సందర్భంగా లబ్ధిదారులతో పాటు అప్పారెడ్డి గూడ గ్రామవాసులు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# బిఆర్ఎస్ పార్టీ 25 వ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

-నల్గొండ అంజి, టిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు



నల్లగొండ ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీమంత్రి జగదీష్ రెడ్డి ఉన్నప్పుడే అభివృద్ధి చెందిందని తెలంగాణ స్టూడెంట్ యునియన్ రాష్ట్ర అధ్యక్షులు (టిఎస్ యు) నల్గొండ అంజి అన్నారు. ప్రజా ప్రభుత్వం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ఇంతవరకు ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని కూడా నిర్వహించకుండా మాకు మంత్రి పదవులే కావాలని వాళ్లకు వాళ్లే పోట్లాడుకుంటూ అభివృద్ధినీ గాలికి వదిలేసి, ప్రజల సమస్యలను పట్టించుకోకుండా తమ స్వార్ధ రాజకీయాల కోసం నల్లగొండ జిల్లా మంత్రులు ఇప్పటివరకు జిల్లాకు చేసిందేమీ లేదు అని అన్నారు. మేము ఏదో చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ ఎస్ ఎల్ బి సి టెర్మినార్లో పూడుకుపోయిన శవాలను ఈరోజు వరకు కూడా వెలికితీయలేదంటే మన నల్లగొండ జిల్లా మంత్రుల పని విధానం ఎలా ఉందో మనకు అర్థం అవుతుంది. కాబట్టి కెసిఆర్ 10 ఏండ్ల పాలనలో తెలంగాణ ఏ విధంగా అభివృద్ధి జరిగిందో, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ ఒక్క హామిని అమలు పరచకుండా ప్రజలను మోసం చేస్తూ కాలం వెల్లదీస్తుంది. కాబట్టి కెసిఆర్ ఏ తెలంగాణకు శ్రీరామరక్ష అని నలగొండ జిల్లాకు మాజీమంత్రి జగదీశ్ రెడ్డి తోనే అభివృద్ధి సాధ్యమని మనమందరము ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగేటటువంటి బిఆర్ఎస్ పార్టీ 25వ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని నల్గొండ జిల్లా ప్రజలకు తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నల్గొండ అంజి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ వి జిల్లా నాయకులు కత్తుల జయచందన్, రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి సందీప్, వేంపటి శ్రీకాంత్, బి ఆర్ ఎస్ వి నాయకులు కృష్ణ, క్రాంతి కుమార్, సునీల్, రాంబాబు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన బిఆర్ఎస్ నాయకులు.



గణపురం ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
గణపురం మండల కేంద్రానికి చెందిన నారగాని మాధవి,శ్రీధర్ గౌడ్ ల కుమార్తె అమూల్య ,శ్రీకాంత్ గౌడ్‌లిల వివాహ వేడుకకు హాజరై శుక్రవారం బిఆర్ఎస్ నేతలు నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పోలుసాని లక్ష్మీనరసింహారావు, మండల శాఖ అధ్యక్షులు మోతె కరుణాకర్ రెడ్డి, పిఎసిఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రా రెడ్డి, యూత్ నాయకులు గాజర్ల చింటూ గౌడ్, మార్క సాయి గౌడ్,బబ్లుగౌడ్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# సార భద్రమ్మ పార్థివ దేహాన్ని సందర్శించిన చిలువేరు సమ్మయ్య గౌడ్..



కేసముద్రం,ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామానికి చెందిన సార భద్రమ్మ శుక్రవారం పరమ పదించగా వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత గోపా డివిజన్ అధ్యక్షులు కాంగ్రెస్ మండల నాయకులు చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని కోరుకుంటూ మృతురాలు భద్రమ్మ కుమారులు సార లాలయ్య గౌడ్,రాజు గౌడ్ లను పరమార్శించి ఓదార్చి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ పరామర్శలోవీరి వెంట గంధసిరి వెంకటేశ్వర్లు, పెదగాని వెంకటేశ్వర్లు,మాజీ ఎంపీటీసీ మేడి ఉపేందర్, కోతి వెంకటరమణ, యుగంధర్ బండారి,తెలంగాణ శ్రీనివాస్ నాయక్,గంధసిరి మల్లేష్, సాంబయ్య,మునికుంట్ల కన్నయ్య, సాంబయ్య తదితరులు ఉన్నారు..

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



నేరేడుచర్ల, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)
నేరేడుచర్ల మండల పరిధిలోని మేడారం గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మేడారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్టా కృష్ణారావు,గ్రామ కాంగ్రెస్ నాయకులు పారెపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా లబ్ధి దారులైనటువంటి మండలి రాజేష్ తండ్రి బిక్షం రెండు చెక్కులు కలిపి 77,500 మరియు కటికోలా అలివేలు భర్త వెంకటేశ్వర్లు 60 వేల రూపాయల చెక్కు మరియు జిల్లోజు వినయ్ చారి తండ్రి సైదాచారి 60 వేల రూపాయల చెక్కులను అందజేశారు. అనంతరం గ్రామ అధ్యక్షులు కట్టా కృష్ణారావు మాట్లాడుతూ నేరేడుచర్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొణతం చిన్న వెంక రెడ్డి మరియు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు సహకారంతో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్స్ చెక్కులను అతి త్వరగా లబ్ధిదారులకు అందజేశారని ఆయన కొనియాడారు. అదే విధంగా దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతవరకు ప్రవేశపెట్టని సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి పేదవాడి కుటుంబంలో ఆనందాలు వెలిగేలా కృషి చేశారని ఆయన అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వారు అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాలలో కూడా ఇంతవరకు సన్న బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టకుండా ఈరోజు కేంద్ర గవర్నమెంట్ ఇస్తుందని చెప్పుకోవడానికి బిజెపి నాయకులకు,టిఆర్ఎస్ నాయకులకు సిగ్గుండాలని ఎద్దేవా చేశారు. ఇట్టి కార్యక్రమంలో మత్స్యశాఖ చైర్మన్ మామిడి వెంకటేశ్వర్లు,ఎస్సీ సెల్ నాయకులు గొట్టేముక్కల ముక్కంటి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనగంచి నాగేశ్వరావు,మామిడి నరసయ్య, పెరబోయిన మల్లయ్య,సోము వెంకటి,పొట్ల బాలకృష్ణ, మీసాల రాములు, కటికోల శ్రీనివాస్, ఉడుగుండ్ల గురవయ్య, కటికోల వెంకన్న,పెద్ది సైదులు, రాచకొండ అశోక్, కోల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.


# బంగ్లా మైనార్టీ హిందువులనురక్షించండి

## యూనస్ వ్యాఖ్యలకు భారత్ ధీటుగా జవాబు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టంతో నెలకొన్న హింసపై బంగ్లాదేశ్ ముఖ్య సలహాదారు ముహమ్మద్ యూనస్ స్పందించిన తీరుపై భారత్ ఘాటుగా సమాధానం చెప్పింది. గత వారం బెంగాల్ రాష్ట్రంలోని ముర్షిదాబాద్ జిల్లాలో చెలరేగిన హింసలో ముగ్గురు మరణించగా, వందలాది మంది గాయపడిన మైనారిటీ ముస్లిం వర్గాలను రక్షించాలని భారత ప్రభుత్వాన్ని యూనస్ కోరారు. ఇక, బంగ్లాదేశ్ వ్యాఖ్యలను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తోసిపుచ్చారు. ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కంటే, తమ దేశంలోని మైనారిటీల హక్కులను కాపాడు కోవడంపై దృష్టి పెట్టాలని చురకలు అంటించాడు. బంగ్లాదేశ్ మైనార్టీలపై కపట ప్రేమ చూపిస్తుందని ఆరోపించారు. బంగ్లాలో మైనారిటీలపై జరుగుతున్న హింస నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నంగా అభివర్ణించారు. ఇక, గత సంవత్సరం మాజీ ప్రధాన మంత్రి షేక్ హసీనా పదవీచ్యుతులైనప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో పరిస్థితి గందరగోళంగా ఉంది. బంగ్లాలో మైనార్టులుగా ఉన్న హిందువులపై తీవ్రవాద ఇస్లామిస్టులు అనేకసార్లు దాడులకు పాల్పడ్డారు. దాదాపు 200 దేవాలయాలను ధ్వంసం చేయగా.. పూజారులను అరెస్టు చేశారు.. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని హింసించారనే ఆరోపణలను బంగ్లాదేశ్ తరచుగా ఖండించింది.

# ఎలాన్ మస్క్‌తో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
టెక్ టైకూన్, టెస్లా బాస్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలోని డోజ్ శాఖ అధిపతి ఎలాన్ మస్క్ తో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. సాంకేతికత, నూతన ఆవిష్కరణల్లో సహకారం, భాగస్వామ్యం గురించి వారు చర్చించారు. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా ఎక్స్ వేదికగా వెల్లడించారు.ఎలాన్ మస్క్‌తో పలు అంశాలపై మాట్లాడినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో యూఎస్ పర్యటన సందర్భంగా వాషింగ్టన్ డీసీలో మస్క్‌తో భేటీలో చర్చకు వచ్చిన అంశాలను ప్రస్తావించినట్లు చెప్పారు. సాంకేతికత, ఆవిష్కరణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న ప్రాముఖ్యతపై చర్చించినట్లు తెలిపారు. ఈ రంగాల్లో అమెరికాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భారత్ కట్టుబడి ఉంది అంటూ ప్రధాని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. టారిఫ్‌ల విషయంలో భారత్, అమెరికా మధ్య వాణిజ్య చర్చల అంశం కొనసాగుతోన్న వేళ వీరిద్దరి మధ్య ఫోన్ సంభాషణ ఆసక్తికరంగా మారింది.

# బెట్టింగ్ యాప్‌లపై త్వరలోనే నిషేధం

## -సమగ్రచట్టం తెస్తామన్న మంత్రినారా లోకేశ్



**అమరావతి, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామని మంత్రి లోకేష్ హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌లపై లోకేష్ స్పందించారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని తనకు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ఎక్స్‌లో పెట్టిన ఒక పోస్టుపై లోకేష్ తీవ్రంగా స్పందించారు. బెట్టింగ్ యాప్‌లపై రాష్ట్రంలో ఉక్కుపాదం మోపుతామన్న లోకేష్.. ఏపీలో బెట్టింపు యాప్‌ల నిషేదానికి సమగ్ర విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. ఇది దేశానికే ఆదర్శంగా ఉండే విధానంగా ఉంటుందని చెప్పారు. న్యాయపరమైన అన్ని అవకాశాలను ఉపయోగించుకుని బెట్టింగ్ సంస్కృతిని ఆపేందుకు ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. బెట్టింగ్ యాప్‌ల వలన జీవితాలు నాశనం అవుతున్నాయని పేర్కొన్నారు. అనేక మంది బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులై ఆర్థికంగా దెబ్బతింటున్నారని, ఇట-వంటి పరిస్థితి నుంచి వారిని కాపాడేందుకు అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. బెట్టింగ్ యాప్‌లలో జూదం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు కూడా చైతన్యం కావాల్సి ఉందన్నారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

-ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్

-జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలతో రేవత్ పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టి అభివృద్ధి చెందాలని జపాన్ పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం పలికారు. టోక్యోలోని హోటల్ ఇంపీరియల్‌లో జరిగిన ఇండియా-జపాన్ ఎకనామిక్ పార్టనర్‌షిప్ రోడ్‌షోలో తెలంగాణ రాష్ట్ర అధికారిక బృందం పాల్గొని, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించింది. వివిధ రంగాలకు చెందిన దాదాపు 150 మందికి పైగా జపాన్ పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రోడ్ షోలో మాట్లాడిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జపాన్ పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టు-బడులు పెట్టేందుకు రావాలని సాదరంగా ఆహ్వానించారు. దేశంలోనే కొత్త రాష్ట్రం.. అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న తెలంగాణ మీకు హృదయపూర్వకంగా స్వాగతం పలుకుతోంది.. జపాన్‌ను ఉదయించే సూర్యుడి దేశం అని పిలుస్తారు. మా ప్రభుత్వ నినాదం 'తెలంగాణ రైజింగ్'. ఈ రోజు తెలంగాణ జపాన్‌లో



ఉదయిస్తోంది,' అన్నారు. టోక్యో చాలా గొప్ప నగరం. ఇక్కడి మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆవిష్కరణలు అద్భుతం. జపాన్ ప్రజలు సౌమ్యులు, మర్యాదస్తులు, క్రమశిక్షణ కలిగినవారు. మీ నుంచి నేను ఎంతో నేర్చుకున్నాను. హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడానికి టోక్యో నుంచి చాలా నేర్చుకున్నాను,..' అని అన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, నైపుణ్యం గల ప్రతిభ, స్థిరమైన విధానాలను ప్రజా ప్రభుత్వం అందిస్తుందని జపాన్ వ్యాపారవేత్తలకు మాటిచ్చారు. లైఫ్ సైన్సెస్, గ్లోబల్ కెపాబులిటీ-సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ర్ వెహికిల్స్, టె-క్స్‌టైల్స్, ఏఐ డేటా సెంటర్లు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టు-బడులు పెట్టాలని.. భారత్, జపాన్ కలిసికట్టు-గా ప్రపంచానికి అద్భుతమైన భవిష్యత్తును నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భారత రాయబారి సిబి జార్జ్ భారత్-జపాన్ మధ్య బలపడుతున్న ఆర్థిక సంబంధాల గురించి మాట్లాడారు. జెట్రో (జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుటానీ మాట్లాడుతూ.. తెలంగాణతో సహకారాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటి నెట్ జీరో ఇండస్ట్రీయల్ సిటీ-గా హైదరాబాద్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ, దేశంలోనే అద్భుతంగా నిర్మించ తలపెట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్ట్ పై ప్రచార వీడియోలను రాష్ట్ర ప్రభుత్వం ఈ వేదికపై ప్రదర్శించింది. ఎలక్ట్రానిక్స్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, టెక్స్ టైల్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో జపాన్ కంపెనీలకు తెలంగాణలో పెట్టు-బడులకు ఉన్న అనుకూలతలు, అవకాశాలను రాష్ట్ర వాణిజ్య పరిశ్రమల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వివరించారు. రోడ్‌షో తర్వాత తెలంగాణ ప్రతినిధి బృందం మరియు జపాన్‌లోని పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో ముఖాముఖి సమావేశమైంది.

# అమిత్ షా కాదు.. ఏ షా కూడా తమిళనాడును పాలించలేడు

## - ఎంకే స్టాలిన్

**చెన్నై: ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ బీజేపీపై మండిపడ్డారు. ఢిల్లీలోని ఏ శక్తి కూడా దక్షిణాది రాష్ట్రాన్ని ఎప్పటికీ పాలించలేదని అన్నారు. అమిత్ షా కాదు, ఏ షా కూడా తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేయలేడంటూ బీజేపీని సవాల్ చేశారు. తిరువళ్లూరు జిల్లాలో జరిగిన బహిరంగ కార్యక్రమంలో సీఎం ఎంకే స్టాలిన్ మాట్లాడారు. అన్నాడీఎంకేతో బీజేపీ పొత్తు నేపథ్యంలో 2026 ఎన్నికల్లో తమిళనాడులో కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఆయన కొట్టిపారేశారు. 'నేను ఆయన (అమిత్ షా)కు సవాలు విసురుతున్నా. ఢిల్లీ ముందు తమిళనాడు ఎన్నటికీ లొంగదు. ఒక్క అమిత్ షా మాత్రమే కాదు, ఏ షా కూడా తమిళనాడును



పాలించలేరు' అని అన్నారు.కాగా, బీజేపీ ఎన్నికల వ్యూహాలను సీఎం స్టాలిన్ తోసిపుచ్చారు. ఈడీ దాడులతో నేతలను భయపెట్టడం, పార్టీని విచ్ఛిన్నం చేసే ఫార్ములాలు తమిళనాడులో పని చేయవని అన్నారు. 'మీరు కలిగించే అన్ని అడ్డంకులను చట్టబద్ధంగా మేం విచ్ఛిన్నం చేస్తాం. మిమ్మల్ని మీరు మోసం చేసుకోకండి. 2026లో మళ్లీ ద్రవిడ నమూనా ప్రభుత్వమే ఏర్పడుతుంది' అని అన్నారు. మరోవైపు తమిళనాడు ఎప్పుడూ ఢిల్లీ నియంత్రణలో లేదని, అలా ఉండబోదని సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. 'ఢిల్లీ ముందు తలవంచడానికి మేం బానిసలం కాదు. ముత్తువేల్ కరుణానిధి స్టాలిన్ జీవించి ఉన్నంత వరకు మీ ప్రణాళికలు పనిచేయవు' అని అన్నారు. తాము అడిగేవి కేకలు కాదని తమిళనాడు హక్కులని చెప్పారు. 'నేను సీటు కోసం ఎవరి ముందు ఏడవను లేదా మోకాళ్లపై పడను' అని ప్రధాని మోదీకి కౌంటర్ ఇచ్చారు. కాగా, ఆత్మగౌరవం, ధైర్యం, గర్వంతో తమ భూమి నిండి ఉన్నదని స్టాలిన్ అన్నారు. 'ఇక్కడ ఒక్కడిని బెదిరించి, పొత్తులు పెట్టుకుని మీరు గెలువగలరా? మీకు కావాల్సిన వారందరినీ తెచ్చుకోండి.. చూద్దాం' అంటూ బీజేపీకి సవాల్ విసిరారు.

# యెమెన్‌పై అమెరికా వైమానిక దాడులు..

## - 38 మంది మృతి

**సనా: ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యెమెన్‌లోని కీలక ప్రాంతమైన రాస్ ఇసా చమురు పోర్టు లక్ష్యంగా అమెరికా విరుచుకుపడింది. అగ్రరాజ్యం జరిపిన వైమానిక దాడుల్లో 38 మంది మృతి చెందారు. మరో 102 మందికి గాయాలయ్యాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నది. ఈ దాడులను అమెరికా మిలటరీ సెంట్రల్ కమాండ్‌తో పాటు హౌతీ ఆరోగ్య శాఖ కూడా ధ్రువీకరించింది. రాస్ ఇసా చమురు పోర్టు యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారుల అధీనంలో ఉన్న విషయం తెలిసిందే. హౌతీలకు ఇంధనాన్ని అందించే స్థావరాన్ని ధ్వంసం చేయడానికి, వారి ఆదాయ వనరులను దెబ్బతీయడానికే ఈ దాడులు నిర్వహించామని అమెరికా ప్రకటించింది. కానీ యెమెన్‌లోని ప్రజలకు ఎలాంటి హానీ తలపెట్టలేదని



వివరించారు. మార్చి 15న హౌతీలపై యుద్ధం ప్రకటించిన తర్వాత ఇదే అతిపెద్ద దాడని తెలిపారు.గత నెల 17న కూడా హౌతీలపై అమెరికా వైమానిక దాడులు చేసింది. యెమెన్ రాజధాని సనా, సదా, హౌతీల బలమైన ప్రాంతం అల్‌బేద్, రాడాలపై అమెరికా సేనలు శనివారం బాంబుల వర్షం కురిపించాయి. ఎర్రసముద్రంలో అగ్రరాజ్య నౌకపైకి హౌతీలు దాడికి సమాధానంగా అమెరికా పెద్దయెత్తున జరిపిన బాంబు దాడుల్లో 31 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. బాంబు దాడులతో ఆయా ప్రాంతాలు భూకంపం వచ్చినట్టు కంపించిపోయాయని స్థానికులు తెలిపారు. కాగా, 'మీ టైం అయిపోయింది. ఈ రోజు నుంచే మీ దాడులను నిలిపివేయండి. అలా చేయకపోతే ఇంతకుముందెన్నడూ చూడని విధంగా నరకాన్ని చవిచూస్తారు. తమ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకోకుంటే ఎప్పుడు చూడని రీతిలో బాంబుల వర్షం కురిపిస్తాం. ప్రపంచంలోని జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకాదళ నౌకలు స్వేచ్ఛగా వెళ్లకుండా ఏ ఉగ్రశక్తీ ఆపలేదు' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హౌతీలను హెచ్చరించారు.

# తొమ్మిదేళ్ల బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన బాలుడు..

**బేగంపేట, ఏప్రిల్ 18(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఇంటి బయట ఆడుకుంటున్న బాలికతో ఓ మైనర్ బాలుడు అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. హైదరాబాద్ బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నానగర్ ప్రాంతానికి చెందిన తొమ్మిదేళ్ల బాలిక గురువారం సాయంత్రం ఇంటి బయట ఆడుకుంటుంది. అదే ప్రాంతంలో నివసించే బిహార్‌కు చెందిన బాలుడు



(16) ఆమెకు చాక్లెట్ ఇస్తానని ఆశచూపి ఇంట్లోకి తీసుకెళ్లాడు. అనంతరం బాలిక చేతులు కట్టేసి అసభ్యంగా వ్యవహరించాడు. ఊహించని చర్యతో భయపడిపోయిన బాలిక కేకలు వేస్తూ ఇంట్లో నుంచి పారిపోయింది. తల్లిదండ్రులకు వెళ్లి జరిగిన విషయం చెప్పింది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరుస్తామని బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు తెలిపారు.